క్లుప్తంగా

మెరిట్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోండి

టి.నరసాపురం: ఏలూరు జిల్లాలోని 7, 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎడ్యుకేషనల్ ఎఫిఫని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ఈఈ మెరిట్ టెస్ట్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ సముద్రపు రాము కోరారు. నవంబర్ 14 లోపు అర్హులందరూ రిజిస్టర్ అయ్యేలాగా స్కూల్ హెచ్‌ఎంలు ప్రోత్సహించాలని కోరారు. డిసెంబర్ 29 న ప్రిలిమ్స్, జనవరి 19న మెయిన్స్ ఆన్‌లైన్లో పరీక్షలు జరుగుతాయని, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో 9 లక్షల నగదుతో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఎడ్యుకేషన్ ఎఫిఫని డాట్ ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8639170384, 9533226615 నంబర్లను సంప్రదించాలన్నారు.

సర్పంచ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



జగిడి బాలరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తెల్లం బాలరాజు

కుక్కునూరు: ఇటీవల వింజరం సర్పంచ్ జగిడి బాలరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని శనివారం పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు. జగిడి బాలరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలరాజు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదే పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మామిళ్ల కామేష్ కుటుంబానికి కూడా పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పరింపూడి పంచాయతీ పరిధిలో 20 చోట్ల నిర్మించబోయే సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం సర్పంచ్ ముప్పిడి విజయకుమారి వార్డు సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.1.20 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రధానంగా ఎస్సీ ఎస్టీ ఏరియాలలో అభివృద్ధి నిధులు ఎక్కువగా వినియోగించనున్నామన్నారు.

రక్త పింజరి పాము పట్టివేత



జంగారెడ్డిగూడెంలో రక్తపింజరి పామును పట్టుకున్న చదలవాడ క్రాంతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలో నాలుగు అడుగుల పొడవున్న రక్తపింజర (పొడపాము) ప్రవేశించింది. గమనించిన సిబ్బంది సమీపంలోని స్నేక్ సేవియర్స్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్రాంతి చాకచక్యంగా పామును పట్టుకుని సమీపంలోని అడవుల్లోకి తరలించారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన పారిజాతగిరి



విశేష అలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి గోవింద నామస్మరణతో మార్మోగింది. శనివారం స్వామివారిని విశేషంగా అలంకరించి అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప మాలాధారణ స్వాములు, భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. కొయ్యలగూడెం మండలం గంగన్నగూడెం గ్రామ ఓ భక్తురాలు స్వామివారికి తలనీలాలతో పాటు, నిలువు దోపిడీగా తనవంటి పై ఉన్న బంగారు వస్తువుల్ని స్వామివారి హుండీలో వేసి మొక్కుబడులు చెల్లించుకుంది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈవో మానికల రాంబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఖరీఫ్‌లో తెగుళ్ల బెడద

- అధిక ఉష్ణోగ్రతలతో వరిని ఆశిస్తున్న అగ్గి, పొడ తెగుళ్లు
- ఆందోళన చెందుతున్న రైతులు



అగ్గి తెగులు ఆశించిన వరి పంట, డి. ముత్యాలరావు, వ్యవసాయాధికారి

బుట్టాయగూడెం: గత కొద్ది రోజులుగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల ప్రభావం ఖరీఫ్ పంటలపై పడినట్లు కనిపిస్తుంది. పగటిపూట వేసవిని తలపించేలా తీవ్రమైన ఎండలు, రాత్రివేళల్లో మంచు పడడంతో ఖరీఫ్ పంటలకు తెగుళ్ల బెడద పట్టుకుంది. పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల పరిధిలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వరి పంటలకు అగ్గి తెగులు, పొడ తెగులు పంటలకు సోకింది. ఈ తెగుళ్లు దిగుబడిపై ప్రభావం చూపుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో 24,247 ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో 24,247 ఎకరాల్లో రైతులు వరి పంట వేసినట్లు అధికారులు తెలిపారు. బుట్టాయగూడెం మండలంలో 3,561 ఎకరాలు, జీలుగుమిల్లిలో 3,020 ఎకరాలు, పోలవరంలో 6,569 ఎకరాలు, కొయ్యలగూడెంలో 6,584 ఎకరాలు, కుక్కునూరులో 858 ఎకరాలు, వేలేరుపాడులో 1,255 ఎకరాలు, టి.నర్సాపురంలో 2,400 ఎకరాల్లో రైతులు వరి పంటలను సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా 7 మండలాల పరిధిలో సుమారు 3,500 ఎకరాల వరకూ అగ్గి, పొడ తెగులు ఆశించినట్లు గుర్తించామని వ్యవసాయాధికారులు వెల్లడించారు.

అగ్గి, పొగ తెగులు నివారణ ఇలా

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి పంటల్లో ఎక్కువగా అగ్గి, పొడ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందుగా నత్రజని వాడకాన్ని నివారించారు. వరి పొలాల్లో నీరు నిల్వ ఉంటే వెంటనే ఆ నీటిని బయటకు తీసివేసి వరి చేనును బాగా ఆరబెట్టాలి. వరి పంటలో పొటాష్ ఎరువులు వేసుకోవాలి. అగ్గి తెగులు నివారణకు ఒక ఎకరానికి 120 గ్రాములు ట్రైసైక్లాజోల్ 2 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే పొడతెగులు నివారణకు 200 లీటర్ల నీటిలో 250 ఎమ్‌ఎల్ హెక్సాకొనజోల్‌ను కలిపి చేను బాగా తడిసేటట్టు పిచికారీ చేయాలి. అలాగే వరి చేను చుట్టూ ఉన్న గట్టుపై కూడా ఈ మందును తప్పనిసరిగా పిచికారీ చేయాలి.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

పోలవరం రూరల్: రీ సర్వేలో వచ్చిన భూములకు సంబంధించిన సమస్యలపై తెలియజేయాలని తహసీల్దార్ బీఎస్‌ఆర్‌ఎల్ రాజు అన్నారు. పోలవరం మండలం ప్రగఢపల్లి గ్రామంలో రీ సర్వే భూములకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా సమావేశం దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. పలువురు రైతులు ఫోటోలు మార్పులు, మ్యూటేషన్ తదితర సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లింగపాలెం: భూ రీసర్వే గ్రామసభలు శనివారం పోచవరం గ్రామంలో నిర్వహించారు. తహసీల్దార్ మహమ్మద్ నజీముల్లా షా అధ్యక్షతన గ్రామసభ నిర్వహించగా, రీ సర్వేకు సంబంధించి ప్రజల నుంచి 5 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నాగబాబు తెలిపారు. గ్రామసర్పంచ్ ముసునూరు రాము, ఉప సర్పంచ్, రెవెన్యూ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మేకలు మృతి



మృతి చెందిన మేకలు

కుక్కునూరు: పిడుగుపాటుకు గురై మూగజీవాలు మృతి చెందిన ఘటన శనివారం దాచారం పంచాయతీ పరిధిలో జరిగింది. పాతదాచారం గ్రామానికి చెందిన వర్సా వీరయ్య మేకలను మేపేందుకు సమీంలోని అటవీప్రాంతానికి తీసుకెళ్లాడు. కాగా సాయంత్రం సమయంలో మేత మేస్తున్న మూగజీవాలపై పిడుగుపడడంతో తొమ్మిది మేకలు మృతి చెందాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మేకల యజమాని వీరయ్య కన్నీటి పర్యంతమైయ్యాడు.

విద్యార్థులను బయటకు పంపించొద్దు

పోలవరం రూరల్: వసతి గృహాల్లోని విద్యార్థులను అనుమతులు లేకుండా బయటకు పంపించవద్దని జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ తెలిపారు. పోలవరం గ్రామంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహాన్ని ఆయన శనివారం సందర్శించారు. వసతిగృహంలో వసతులు, భోజన పథకం అమలుతీరు, సిబ్బంది విధి నిర్వహణలో ఏ విధంగా ఉంటున్నారు అనే విషయాలను విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు. ఏవిధమైన సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువెళ్లవచ్చని సూచించారు. కార్యక్రమంలో జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్‌ఆర్ తేజస్విని, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

హాస్టల్ ఆకస్మిక తనిఖీ

టి.నరసాపురం: విద్యార్థుల సంరక్షణపై శ్రద్ధతో వ్యవహరించాలని చింతలపూడి కోర్టు మేజిస్ట్రేట్ సీహెచ్ మధుబాబు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం అవిలా చిల్డ్రన్ హాస్టల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని తరగతి గదులను, భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల శుభ్రత, విద్యార్థుల సంక్షరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. హాస్టల్‌లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. టి.నరసాపురం ఎస్సై ఎం.జయబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలవరం రూరల్: హాస్టల్‌ను సందర్శించిన జడ్జిలు కిషోర్ కుమార్, తేజస్విని



టి.నరసాపురం: బొర్రంపాలెంలోని చిల్డ్రన్ హాస్టల్‌లో సౌకర్యాలపై ఆరా తీస్తున్న మేజిస్ట్రేట్ మధుబాబు

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సైరామకృష్ణ

కుక్కునూరు: ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలను చేర్చాలని, వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ఎస్సై రామకృష్ణ ఆటోడ్రైవర్లను కోరారు. శనివారం అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేగంగా ఆటోలు నడిపి ప్రమాదాల బారిన పడకుండా, నిదానమే ప్రధానంగా సాగాలని సూచించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ ఆటోలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని ఎస్సైని కోరారు.

బకాయిలు చెల్లించాలని మంత్రికి వినతి



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎల్‌ఆర్ కృష్ణబాబు తదితరులు

జంగారెడ్డిగూడెం: గతంలో వివిధ ప్రభుత్వ పథకాల ప్రచారం నిమిత్తం కళాకారులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్‌ఆర్ కృష్ణబాబు కోరారు. శనివారం అన్నవరప్పాడులో మంత్రి కందుల దుర్గేష్‌ను కళాకారులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ గతంలో నగరదర్శిని, గ్రామదర్శిని, జన్మభూమి తదితర పథకాలు ప్రచారం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా కళాకారులు బృందాలుగా పని చేశారన్నారు. వారికి సుమారు రూ.8 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. పాత బకాయిలు చెల్లించడంతోపాటు, 50 ఏళ్ల దాటిన కళాకారులకు గౌరవ వేతనం ఇవ్వాలని, కళాకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కల్వర్టు కష్టాలు



రెడ్డిగణపవరం సమీపంలో దెబ్బతిన్న కల్వర్టుపై నుంచి నడిచి వెళ్తున్న విద్యార్థులు

బుట్టాయగూడెం: విద్యార్థులు కల్వర్టు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలో జల్లేరు వాగుపై ఉన్న కల్వర్టు దెబ్బతింది. దీంతో ఈ కల్వర్టుపై వాహనాలు తిరిగే పరిస్థితి లేదు. రెడ్డిగణపవరం గ్రామం నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం ఆ కల్వర్టును దాటుతూ నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లే సమయంలో తిరిగి ఇళ్లకు వచ్చే సమయంలో కల్వర్టు దాటి వేరే వాహనాల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కల్వర్టు మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



లక్కవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

జంగారెడ్డిగూడెం రూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని లక్కవరం ఇన్‌చార్జి ఎస్సై రామకృష్ణ అన్నారు. లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు వినియోగిస్తున్న ఆండ్రాయిడ్ ఫోన్ల ద్వారా డిజిటల్ ట్రాన్సాక్షన్లను అవకాశంగా మలుచుకుని నేరగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కి సమాచారం ఇస్తే సహాయం అందిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ కల్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2.22 లక్షల విరాళం



దాతలకు శ్రీవారి ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన మోటపర్తి కోటేశ్వరరావు, రాజ్యలక్ష్మి దంపతులు శనివారం రూ.2,22,232 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ఈఓ ఎన్వీఎస్ఎన్ మూర్తి బాండ్ పత్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం దాత దంపతులకు శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

రేపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

ద్వారకాతిరుమల: జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 21న ద్వారకాతిరుమల క్షేత్రాన్ని సందర్శించనున్నారు. అందులో భాగంగా ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారిని దర్శించుకోనున్న ఆయన, రాత్రి కొండపైన అతిథి గృహంలో బస చేస్తారని, మరుసటి రోజు ఉదయం 10 గంటలకు క్షేత్రం నుంచి బయల్దేరి ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకుంటారని అధికారులు తెలిపారు.

రోడ్డుపైనే సిరంజిలు



రాజవరం ప్రధాన రహదారి పక్కనే పారవేసిన ఉపయోగించిన సిరంజిలు, సూదులు

కొయ్యలగూడెం: రాజవరం గ్రామ సమీపంలోని మంగపతిదేవిపాలానికి వెళ్లే రోడ్డులో వైద్య చికిత్సకు ఉపయోగించిన సూదులు, సిరంజిలు ఇష్టానుసారంగా రోడ్డుపైనే పడేశారు. ఇదే రోడ్డు మీదుగా విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పొరపాటున ఏదైనా సూది గుచ్చుకుంటే ఏ విధమైన వ్యాధులు సంక్రమిస్తాయోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ చెత్తను డంపింగ్ యార్డుకు చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టుభద్రుల ఓటుకు నమోదు చేసుకోవాలి



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు కార్యక్రమంపై తహసీల్దార్ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, బీఎల్‌వోలకు ఓటు నమోదుపై సూచనలు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ దరఖాస్తుదారుడు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో నివాసి అయి ఉండి, ఓటు ఎక్కడ ఉందో అక్కడే ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి 2021 నవంబర్ ముందు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని, లేదా సీఈవోఆంధ్రా వెబ్‌సైట్‌లో గాని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు 10వ తరగతి, డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపుకార్డుల జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శ్రీహరి, కంప్యూటర్ ఆపరేటర్ విజయ చంద్రరావు, జూనియర్ అసిస్టెంట్ చందు, వీఆర్‌వోలు, కార్యదర్శులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కే గౌస్

వేలేరుపాడు: వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపందా డివిజన్ కార్యదర్శి ఎస్‌కే గౌస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం సూరి చంద్రరావు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు ఆనకట్ట తెగిపోవటం వల్ల పంట భూములు అనేకం ఇసుక మేటలు వేసి రైతులు చాలా నష్టపోయారని. అలాగే అనేక పశువులు చనిపోయాయని, అనేక ఇండ్లు నేలమట్టమై కొట్టుకుపోయాయన్నారు. ఇంతవరకు వరద బాధితులకు ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమని అన్నారు. వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, కెరటం వీరస్వామి, కారం బాబురావు, మడకం నాగేశ్వరావు, మడివి కనక సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై 19 అర్జీలు

కొయ్యలగూడెం: కన్నాపురం పంచాయతీ పరిధిలో శనివారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ కె.చెల్లన్న దొర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలు భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. కన్నాపురం గ్రామంలో 12, మహాదేవపురం నుంచి 7 దరఖాస్తులు అందినట్లు ఆర్‌ఐ మణి దివ్య పేర్కొన్నారు. 21వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం నిర్వహణ సందర్భంగా గ్రామసభ ఉండబోదని, 22వ తేదీన మంగపతిదేవిపేటలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలోని నాటుసారా తయారీ కేంద్రాలపై శనివారం కుక్కునూరు సీఐ ఎం రమేష్‌బాబు సిబ్బందితో కలిసి మెరుపుదాడులు చేశారు. ఈ దాడులలో 1500 లీటర్ల బెల్లం ఊట, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, నాటుసారాను తయారు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏజెన్సీలో జామాయిల్ సాగుపై మొగ్గు



కుక్కునూరు మండలంలో సాగు చేస్తున్న జామాయిల్

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలో జామాయిల్ సాగు వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రభావంతో ప్రతి ఏడాది గోదావరి వరదలతో పంటలు మొక్కదశలో ఉన్నప్పుడే వరద ముంచెత్తుతుండడం, మరలా పెట్టుబడి పెట్టి ఆలస్యంగానైనా పంటలు సాగుచేసినా అవి దిగుబడి సమయానికి సరైన ధర లేకపోవడంతో రైతులు జామాయిల్ పంటను వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.స్తున్నారు.

ఓ మోస్తరు వర్షం చాలు

ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా జామాయిల్ మొక్కలకు వచ్చిన నష్టమేమి ఉండదు. వర్షాకాలంలో మొక్కలు వేసిన తరువాత ఓ మోస్తరు వర్షం కురిస్తే మొక్క బతుకుతుంది. మూడు, నాలుగు నెలల్లో ఈ మొక్కలు ఐదారు అడుగుల ఎత్తు పెరుగుతాయి. దీంతో ఒక్కసారి జామాయిల్ వేసి వదిలితే పదేళ్ల వరకు చూసుకోవాల్సిన పనిలేదు. దీనిని దృష్టిలో ఉంచుకోని రైతులు సాధారణ పంటలైన పత్తి, మొక్కజొన్న, మిరప వంటి కంటే జామాయిల్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన రేట్లతో రైతులకు లాభాలు

ఎకరానికి 1100 వందల మొక్కలు వరకు నాటుతారు. నాటిన నాటి నుంచి పంట ఎదిగే వరకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. గతంలో జామాయిల్ టన్ను ధర రూ.3,600 వరకు ఉండగా ప్రస్తుతం రూ.8,300 పలుకుతుంది. ప్రస్తుత ధర ప్రకారం పెట్టుబడి పోను ఎకరానికి తక్కువలో తక్కువగా రూ.లక్షకు పైగా లాభం వస్తుండడంతో రైతులు ఆ పంటపై మొగ్గుచూపుతున్నారు. కాగా జామాయిల్ సాగుతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదముందని, దీనివలన భవిష్యత్ తరాలు దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు భావిస్తున్నారు.

మద్ది ఆంజనేయస్వామికి అభిషేకాలు



ఎమ్మెల్యే చినరాజప్పకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో చందన

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారికి శనివారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి వారిని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు శేషవస్త్రం కప్పి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈవో ఆర్‌వీ చందన స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని చిన రాజప్పకు అందజేశారు. ఈ సందర్భంగా మద్ది క్షేత్రానికి వివిధ రూపాల్లో 86,447 వచ్చిందని, 1200 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈవో తెలిపారు.